50 రోజుల్లో రూ.33 లక్షల వ్యాపారం



- సంపద సృష్టిలో **దూసుకుపోతున్న** మహిళలు
- ప్రభుత్వ ప్రోత్సాహంతో వైఎస్సార్ మహిళా మార్టు ఏర్పాటు
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విరాజిల్లుతున్న మహిళా సాధికారిత

ఆనందపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారిత కోసం అమలు పరుస్తున్న పలు పథకాలు సత్ఫలితాలు ఇవ్వడంతో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని పురుషులతో సమానంగా ముందుకు దూసుకుపోతున్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయం శక్తితో ఎదిగి వ్యాపార రంగంలో కూడా రాణించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కన్న కలలను నిజం చేస్తున్నారు. మహిళలు తమ శక్తిని చాటుతూ ఉపాధిని మెరుగు పరుచుకుంటున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్టులు అందుకు వేదికగా నిలుస్తున్నాయి. జిల్లాలో మొట్టమొదటి సారిగా ఆనందపురంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ మహిళా మార్టు వస్తువుల విక్రయాలలో దూసుకుపోతోంది. ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాలు ద్వారా లభిస్తున్న ఆర్థిక సాయం మహిళలకు ఎంతగానో ఉపయోగ పడడంతో ఆ మొత్తాలను మహిళా మార్టులో పెట్టుబడిగా పెట్టి వ్యాపారం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలోని 26 పంచాయతీల్లో 53 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. వాటి పరిధిలో 1,564 స్వయం సహాయక సంఘాలు ఉండగా 16,363 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ మహిళా మార్టు వ్యాపారంలో భాగస్వామ్యం కల్పించారు. మార్టుని మొత్తం అందరూ మహిళలే నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణానికి సరకులు కొనుగోలు, నిర్వహణకు రూ.79.90 లక్షల వ్యయం చేశారు. రూ.16.90 లక్షలతో సొంతంగా ప్యాకింగ్ యూనిట్‌ని ఏర్పాటు చేసుకున్నారు.


ఆనందపురంలోని వైఎస్సార్ మహిళా మార్టు


వస్తువులు కొనుగోలు చేస్తున్న మహిళలు


మహిళా మార్టులో వస్తువులు కొనుగోలు చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే శ్రీనివాసరావు (ఫైల్)

మెలకువలు నేర్చుకుంటున్నాం

సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతో ఏర్పాటు చేసుకున్న వైఎస్సార్ మహిళా మార్టు వల్ల వ్యాపార మెలకువలు నేర్చుకుంటున్నాం. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవడానికి ప్రభుత్వం జగనన్న తోడు పేరుతో వడ్డీ లేని రుణం అందిస్తోంది. దీంతో వ్యాపారం చేసి లాభాలు ఎలా పొందాలనే విషయాన్ని మహిళా మార్టు ద్వారా తెలుసుకోగలుగుతున్నాం. దీంతో మహిళల జీవితాల్లో మార్పు కనిపిస్తోంది.

– బుంగ.రమ, మార్ట్ ఓబీ

జీవనోపాధి మెరుగవుతోంది

ఇంతవరకూ డ్వాక్రా సంఘాలు పొదుపు చేయడానికే పరిమితమయ్యాయి. పొదుపు వృథా కాకుండా ఆ మొత్తాలను పెట్టుబడిగా పెట్టి వ్యాపార రంగంలోకి తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం. ప్రతి మహిళ వ్యాపారవేత్తగా రాణించాలన్న సీఎం జగన్ మోహన్ రెడ్డి కలలకు మహిళా మార్టులు తొలి వేదికగా మారాయి. ఇక్కడ నేర్చుకున్న మెలకువలతో ప్రతి మహిళ వ్యక్తిగత వ్యాపారాలు చేసుకోవడానికి అవకాశం కలుగుతోంది. దీంతో మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

– మజ్జి శ్యామల, వీవోఏ, గిడిజాల గ్రామైఖ్య సంఘం

మహిళా మార్ట్ స్వరూపం

మహిళా మార్టు ప్రారంభమయ్యాక 52 రోజుల్లో రూ.38 లక్షల వస్తువుల విక్రయం

రూ.31.31 లక్షలు డ్వాక్రా సభ్యుల వాటా ధనం

రూ.1.56 లక్షలు సభ్యులు ప్రవేశ రుసుంగా సమకూర్చింది.

రూ.31.01 లక్షలు మార్టు భవనం నిర్మాణం కోసం సమకూర్చింది.

రూ.10 లక్షలు మండల మహిళా సమాఖ్య నుంచి తీసుకున్న రుణం

రూ.3 లక్షలు జిల్లా మహిళా సమాఖ్య నుంచి తీసుకున్న రుణం

రూ.31.35 కోట్లు ఆసరా ద్వారా 3 విడతలుగా 13701 మంది సభ్యులకు లబ్ధి

రూ.23.95 కోట్లు చేయూత ద్వారా 3 విడతలుగా 4,638 మంది సభ్యులకు లబ్ధి

క్లుప్తంగా

ట్యాబ్‌లు సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న బోని అప్పలనాయుడు తదితరులు

ఆనందపురం : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయడు కోరారు. మండలంలోని బోని గ్రామంలో 8వ తరగతి చదువుతున్న 18 మంది విద్యార్థులకు శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యా రంగంలో మార్పులు తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో నాడు – నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను ఆధునికీకరించారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బోని అప్పలకొండ, బోని సన్యాసినాయుడు, హెచ్‌ఎం ఎస్.కృష్ణారావు పాల్గొన్నారు.

హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు 5 వరకు గడుపు పెంపు

తగరపువలస: దక్షిణ భారతదేశ హిందీ ప్రచార సభ – చెన్నై ద్వారా నిర్వహించే పరీక్ష ఫీజుల చెల్లింపునకు గడువును 2024 జనవరి 5 వరకు పొడిగించారు. ప్రాథమిక పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక పరీక్షలకు అపరాధ రుసుం లేకుండా, హయ్యర్ పరీక్షలైన రాష్ట్ర భాష విశారద పూర్వార్ధ – ఉత్తరార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్ధ – ఉత్తరార్ధ పరీక్షలకు రూ.10 అపరాధ రుసుముతో చెల్లించవచ్చని భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. వివరాలకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని కోరారు.

'స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తా'

పద్మనాభం: మధురవాడ ప్రాంతానికి చెందిన తాను 2024లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భీమునిపట్నం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని నాగోతు నాగమణి అన్నారు. పద్మనాభంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అనంత పద్మనాభస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు


అయోధ్య అక్షింతలు తీసుకెళ్తున్న భక్తులు

పద్మనాభం: మండలంలోని బి.ఆర్.తాళ్లవలస పంచాయతీ బొత్సపేట రామాలయం నుంచి శనివారం రాత్రి ఆయోధ్య రామ మందిరం అక్షింతలను కోరాడ పంచాయతీ గెద్దపేట రామాలయానికి తీసుకెళ్లారు. మేళతాళాల మధ్య ఈ అక్షింతలు తీసుకెళ్లారు. వీటిని ఇంటింటికీ పంపిణీ చేస్తారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, కోరాడ మాజీ ఎంపీటీసీ సభ్యుడు కోంగ్రోతు శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు గెద్ద ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై ముగిసిన వర్క్‌షాప్

తగరపువలస: సంగివలస అనిట్స్ కెమికల్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జాతీయ స్థాయిలో నిర్వహించిన 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ కెమికల్ ఇంజినీర్స్' వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం కెమికల్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ కేవీ రమేష్ మాట్లాడుతూ కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యత వివరించారు. దీని వినియోగంలో జాగ్రత్తలు, సామర్థ్యాన్ని తెలియజేశారు. అనిట్స్ కెమికల్ విభాగాధిపతి ఆర్.శ్రీకాంత్, కోఆర్డినేటర్ సీహెచ్.అనిల్, ఎస్.హారిక, కె.చిన మాలకొండయ్య, ఎం.కోటేశ్వరరావు, డి.అంజలి, బి.ప్రదీప్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీని చంద్రబాబు నిర్లక్ష్యం చేశారు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


కొత్తగా మంజూరైన ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: ప్రజలకు మేలు చేసే ఆరోగ్యశ్రీ పథకాన్ని చంద్రబాబు హయాంలో నిర్లక్ష్యం చేశారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వం ఇటీవల కొత్తగా రూ.25 లక్షల పరిమితితో మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ కార్డులను శనివారం సాయంత్రం భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీలో లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచనలతోనే తామంతా విపక్షకు తావు లేకుండా టీడీపీకి చెందిన వారికి కూడా సంక్షేమ పథకాలు చేరవేశామన్నారు. సినిమాలు అన్నం పెట్టవని, ప్రజలకు మేలు చేసేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అన్నారు. చంద్రబాబు, పవన్‌ల కడుపుమంట మాటలు ఎవరూ విశ్వసించవద్దన్నారు. వేకువజామునే ఇంటి తలుపులు తట్టి సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్, సచివాలయ వ్యవస్థలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. మూలకుద్దు సచివాలయం పరిధిలో రేఖవానిపాలెంతో కలిపి ఈ అయిదేళ్లలో రూ.17.91 కోట్ల సంక్షేమ పథకాలు 1,535 కుటుంబాలకు అందించామన్నారు. రూ.8.97 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. జనవరిలో పెన్షన్ పెంపు, డ్వాక్రా మహిళలకు ఆసరా సాయం, ఫిబ్రవరిలో చేయూత సాయం ప్రభుత్వం తరపున పంపిణీ చేస్తామన్నారు. సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో జానకి, తాళ్లవలస పీహెచ్‌సీ ప్రధాన వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, మూలకుద్దు ఇన్‌చార్జి సర్పంచ్ కొయ్య రామకృష్ణారెడ్డి, పొట్నూరు చంద్రశేఖర్, మేరుగు ఎల్లాజీ, ఎం .హరిశంకర్, వార్డు సభ్యుడు మహేష్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి దుర్మరణం


ఘటనా స్థలిలో పరిశీలిస్తున్న పోలీసులు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో శనివారం ట్రాక్టర్ తిరగడి ఒకరు దుర్మరణం చెందినట్టు పోలీసులు తెలిపారు. పాండ్రంగి గ్రామానికి చెందిన పల్లి సూరిబాబు (35), మరో నలుగురు కలిసి అదే గ్రామంలో భూమి లీజు తీసుకుని ఇటుకల బట్టీ పెట్టారు. ఆ బట్టీకి లారీతో శనివారం ఊక తీసుకొచ్చారు. ఊక లోడుతో ఉన్న లారీ బట్టీ వద్ద మట్టిలో కూరుకుపోయింది. కూరుకుపోయిన ఆ లారీకి తాడు కట్టి ట్రాక్టర్‌తో లాగి వెలుపలకు తీయడానికి సూరిబాబు ప్రయత్నించాడు. దీంతో ట్రాక్టర్ అదుపు తప్పి తిరగబడింది. ఈ సంఘటనలో సూరిబాబు ట్రాక్టర్ కింద చిక్కుకుని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సూరిబాబు మృతిపై భార్య రామలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జె.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భీమునిపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య రామలక్ష్మి, వృద్ధురాలైన తల్లి రామప్పడు, కుమార్తె దీక్షిత (6), కుమారుడు వికాశ్ (4) ఉన్నారు. కుటుంబానికి అండగా నిలుస్తున్న సూరిబాబు అకాల మరణంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

విద్యార్థులకు చక్కగా విద్యాబోధన

భీమునిపట్నం: విద్యార్థులకు చక్కగా అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని డీఈవో చంద్రకళ సూచించారు. జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్)లో బాల్యం పాఠశాలల ఉపాధ్యాయులకు శనివారం శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల తరహాలో ప్రాథమిక పాఠశాలల పిల్లలకు బోధన జరుగుతుందన్నారు. వీరంతా పసిపిల్లలు కావడంతో వారి మనస్తత్వాలకు అనుగుణంగా బోధించాలని సూచించారు. డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ బాల్యం ఎంతో ప్రధానమైనదన్నారు. ఆ ప్రకారం వారికి అర్థమయ్యే రీతిలో బోధించడంతో పాటు విలువలు కూడా నేర్పాలన్నారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి గౌరీ శంకరరావు, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, సీనియర్ అధ్యాపకులు గొట్టేటి రవి పాల్గొన్నారు.

శత శాతం ఉత్తీర్ణత సాధనకు చర్యలు


సమీక్షలో మధుసూదనరావు, ఇతర అధికారులు

భీమునిపట్నం: విద్యార్థినులంతా మంచి మార్కులతో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని రాష్ట్ర కేజీబీవీ కార్యదర్శి మధుసూదనరావు అన్నారు. శనివారం ఇక్కడి కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి రూపొందించిన పంచతంత్రం స్టడీ కార్యక్రమంపై ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు.

విద్యార్థులకు అందించిన సిలబస్ ప్రకారం ఏ విధంగా పాఠ్యాంశాలు చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తారన్న దానిపై దృష్టి సారించాలన్నారు. ఇందుకోసం తగిన సూచనలు, సలహాలు ఇవ్వడంతోపాటు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆర్‌జేడీ జ్యోతికుమారి, డీఈవో చంద్రకళ పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన అవసరం


అవగాహన కలిగిస్తున్న మహేష్

తగరపువలస: సాగర్ పరిక్రమ కార్యక్రమంలో భాగంగా భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీలో మత్స్యకారులకు శనివారం అవగాహన కలిగించారు. కిసాన్ క్రెడిట్ రుణాలు, పీఎంఎంఎస్వై పథకాలు, బోట్ల రిపేర్, సబ్సిడీ రుణాలు, రీప్లేస్‌మెంట్ పథకాలపై అవగాహన కలిగించారు. మత్స్యకార శాఖ అధికారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ క్లస్టర్ కమిటీల నియామకం

తగరపువలస: వైఎస్సార్‌సీపీ మండల, క్లస్టర్ పార్టీ కమిటీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. వీరిలో ఆనందపురం మండల పార్టీ అధ్యక్షునిగా బంక సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కోరాడ ముసలినాయుడు, పడాల రామును నియమించారు. భీమిలి మండల పార్టీ అధ్యక్షునిగా గాడు శ్రీను, ఉపాధ్యక్షులుగా బుద్ధిరాజు సత్యనారాయణరాజు, చెల్లూరి నగేష్‌బాబు, పద్మనాభం మండల అధ్యక్షునిగా కోరాడ లక్ష్మణరావు, ఉపాధ్యక్షులుగా అంజూరి అప్పారావు, బానురోతు అప్పారావును నియమించారు. జీవీఎంసీ 1వ వార్డు అధ్యక్షునిగా జగుపల్లి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా తమ్మిన కూర్మారావు, కుంచా శివరామకృష్ణ, 2వ వార్డు అధ్యక్షునిగా చిల్ల భాస్కర రెడ్డి, ఉపాధ్యక్షులుగా అక్కరమాని లోవరాజు, సరగడ శివాంజనేయరెడ్డి, 3వ వార్డు అధ్యక్షునిగా అల్లిపిల్లి నరసింగరావు, ఉపాధ్యక్షులుగా బాకి రమణారెడ్డి, గుండాసు మధునాయుడు, 4వ వార్డు అధ్యక్షునిగా పాల రమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా జగన్నాథ అప్పారావు, నాగోతి అచ్చారావును నియమించారు. మధురవాడ జోన్‌లోని క్లస్టర్ – 4 అధ్యక్షునిగా బొట్ట అప్పలరాజు, ఉపాధ్యక్షులుగా వి.వి.నరసింగరావు, పిల్లా రమణబాబు, క్లస్టర్ – 5 అధ్యక్షునిగా పోతిన శ్రీనివాసరావు, క్లస్టర్ – 6 అధ్యక్షునిగా గుడ్ల పోలిరెడ్డిని నియమించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ యాజమాన్యం శనివారం గుడివాడలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన 90 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే వైద్యుడు తిరుపతి స్వామి ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిల్ల జమున, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు, ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామం

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి, గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు శనివారం పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనానికి భక్తులు బారులు తీరారు. సాయంత్రం శ్రీవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కోలాటాలు, అన్నమయ్య సంకీర్తనలు ఆకట్టుకున్నాయి.

ఏసీపీ శివరామిరెడ్డికి పదోన్నతి



పీఎం పాలెం: విశాఖ నార్త్ సబ్ డివిజన్ ఏసీపీగా పని చేస్తున్న శివరామి రెడ్డికి పదోన్నతి లభించింది. ఆయన తిరుమల అదనపు ఎస్పీగా బదిలీ అయ్యారు. ఆయన గత సంవత్సర కాలంగా విశాఖ నార్త్ సబ్ డివిజన్ ఏసీపీగా పని చేస్తూ విశేష సేవలు అందించారు.

ఏకపాత్రాభినయ పోటీలు నేడు

మధురవాడ: ఉత్తరాంధ్ర పౌరాణిక పద్య, నాటక కళాకారుల సంక్షేమ సేవా సంఘం 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మధురవాడ శిల్పారామం జాతరలో ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించనున్నట్లు సంఘ కార్యదర్శి వంకాయల మారుతీ ప్రసాద్ చెప్పారు. ఉత్తరాంధ్ర కళాకారులచే నిర్వహించే ఈ పోటీల్లో అంతా పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ప్రముఖ, సీనియర్ కళాకారులను సత్కరించనున్నట్టు చెప్పారు.

వేడుకగా దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో దుర్గాలమ్మ


ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మధురవాడ: జాతర గట్టు చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు శనివారం అమ్మవారికి పంచామృత, సుగంధ అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పట్నాల సుబ్బారావు శర్మ, హరిప్రసాద్ శర్మ కుంకుమార్చన, పుష్పార్చన, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సహస్ర దీపారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసింహ కోలాట బృందం ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఆలయం వద్ద చంద్రంపాలెంకి చెందిన జగ్గుపిల్లి అప్పారావు, లక్ష్మి, కమిటీ సభ్యులు సుమారు 4 వేల మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. చంద్రంపాలెం, మధురవాడ, దుర్గానగర్, సాయిప్రియ లే అవుట్, కారుషెడ్, పిలకవానిపాలెం, ఎన్‌జీజీవోస్ కాలనీ పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో ధర్మకర్త పిల్లా చంద్రశేఖర్, కమిటీ ప్రతినిధులు పిల్లా సూరిబాబు, పీవీజీ అప్పారావు, నాగోతి తాతారావు, పిల్లా శ్రీనివాసరావు, దుక్కవరం, పిల్లా మోహన్‌కృష్ణ, పిల్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, మాజీ కార్పొరేటర్ జగ్గుపిల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో పాత్రికేయుల పాత్ర గణనీయం

పీఎం పాలెం: ఉత్తమ సమాజ నిర్మాణంలో పాత్రికేయుల పాత్ర కీలకమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. శిల్పారామం (జాతర)లో స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీని శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత్రికేయులు అందించే విలువలతో కూడిన సేవలు సమాజహితానికి తోడ్పడతాయన్నారు. పీఎం పాలెం లా అండ్ ఆర్డర్ సీఐ రామకృష్ణ మాట్లాడుతూ సామాజిక సేవా దృక్పథంతో పని చేసే పాత్రికేయులు సమాజానికి అవసరమన్నారు. కూచిపూడి నృత్య కళాకారిణి ఎస్ఎస్‌వీ అపర్ణ నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అసోసియేషన్ సభ్యులకు డైరీలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఎస్‌సీఆర్ డబ్ల్యూఏ అధ్యక్షుడు బంగారు అశోక్ కుమార్, అసోసియేషన్ గౌరవ సలహాదారు ఎన్.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి రూ.18 వేల సాయం


రూ.10 వేల చెక్కు అందిస్తున్న వీఎస్ఆర్ కుటుంబ సభ్యులు

తగరపువలస: చిట్టివలస కార్మికవాడకు చెందిన విశ్రాంత జ్యూట్‌మిల్లు కార్మికుడు అల్లు చంద్రరావు వైద్య ఖర్చుల కోసం వీఎస్ఆర్ కుటుంబ సభ్యులు శనివారం రూ.10 వేల చెక్కు అందించగా, రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాల యాజమాన్యం మరో రూ.8 వేలు అందించారు. చంద్రరావు ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో వీఎస్ఆర్ కుటుంబ సభ్యులు సాయం చేసినట్లు సంస్థ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బోగెల కృష్ణ, వాండ్రాసి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు


అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థినులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 98వ వార్డు అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి ట్యాబ్‌లు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య సామాన్యుడికి అందుబాటులో ఉండాలని ఆ నాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ తీసుకొచ్చి పేద విద్యార్థుల ఉన్నత చదువులకు బాటలు వేశారన్నారు. ఆయన తనయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఎన్నో సౌకర్యాలు కల్పించారన్నారు. పేద విద్యార్థుల కోసం అమ్మఒడి, గోరుముద్ద, నాడు–నేడు, విద్యా దీవెన, వసతి దీవెనతో పాటు విద్యాకానుక తదితర కార్యక్రమాల ద్వారా పిల్లల చదువుకు కావాల్సిన అన్ని సౌకర్యాలు జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని తెలిపారు. కులమతాలకు సంబంధం లేకుండా ప్రతీ పేద విద్యార్థి ఉన్నత విద్య అభ్యసించాలన్నదే జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 8వ తరగతి పిల్లలకు క్వాలిటీతో కూడిన టాబ్స్ అందిస్తున్నారన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కృష్ణ, వైఎస్సార్‌సీపీ 98వవార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, కర్రి అప్పలస్వామి పాల్గొన్నారు.